క్లుప్తంగా

రెంటచింతలలో గడప గడపకు మన ప్రభుత్వం వాయిదా

నేడు నిర్వహణ

రెంటచింతల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మండల కేంద్రమైన రెంటచింతలలోని ఎర్రబాలెం కాలనీలో మంగళవారం నిర్వహిస్తున్నట్లు మండల పార్టీ అధ్యక్షులు గొట్టం బ్రహ్మారెడ్డి సోమవారం తెలిపారు. టీడీపీ పిలుపునిచ్చిన రాష్ట్ర బంద్ నేపథ్యంలో సోమవారం పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్ రెడ్డి ఆదేశాల మేరకు మండల కేంద్రంలో 144 సెక్షన్ అమలుచేయడంతో సోమవారం నిర్వహించాల్సిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారంకు వాయిదా వేయడం జరిగిందన్నారు.

పట్టణ సీఐగా బాలకృష్ణ

గురజాల : గురజాల సీఐగా టి.బాలకృష్ణను నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. గతంలో మాచర్ల సీఐగా విధులు నిర్వహిస్తున్న ఆయనను గురజాలకు సాధారణ బదిలీల్లో భాగంగా నియమించారు. ఇప్పటివరకు గురజాల సీఐగా విధులు నిర్వహించిన ప్రభాకర్‌రావు పల్నాడు జిల్లా స్పెషల్ బ్రాంచి సీఐగా విధులు నిర్వహించనున్నారు.

శివయ్య మాస్టారుకు ఐకానిక్ అవార్డు



కారెంపూడి: కారెంపూడికి చెందిన తమ్మిశెట్టి శివయ్య ప్రతిష్టాత్మక సౌత్ ఇండియన్ ఐకానిక్ అవార్డుకు ఎంపికయ్యారు. ఆయన గుంటూరులో ఆదివారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో దీనిని అందుకున్నారు. ప్రస్తుతం గుంటూరులోని ఒక ప్రైవేటు విద్యా సంస్థలో గణిత ఉపాధ్యాయుడిగా శివయ్య పని చేస్తున్నారు. శివయ్య గతంలో కారెంపూడిలో ప్రభుత్వ గుర్తింపు పొందిన సెయింట్ జాన్స్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ ప్రిన్సిపాల్‌గా పని చేశారు. శివయ్య మాస్టారుకు అవార్డు రావడంపై ఆయన పూర్వ విద్యార్థులు అభినందనలు తెలిపారు.

పట్టణంలో భారీ వర్షం




మాచర్ల: పట్టణంలోని ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు భారీ వర్షం కురిసింది. వర్షం విపరీతంగా కురవటంతో మాచర్ల పట్టణం, నియోజకవర్గంలోని ఆయా మండలాలలో చెరువులు, కుంటలు పొంగిపొర్లాయి. 24 గంటలలో అత్యధిక వర్షపాతం నమోదైంది. ఎటుచూసినా పట్టణంలోని మురికి కాలువలు, కొమ్మళ్ళ కాలువ, లోతట్టు ప్రాంతాలలో వర్షపు నీరు నిలిచింది. సాగర్ రోడ్డు, పలు వార్డులలో వర్షపు నీరు భారీగా చేరింది. మొత్తంగా రైతులుకు మరింత మేలు జరిగేలా భారీ వర్షం కురవటంతో ముమ్మరంగా వ్యవసాయ పనులు చేసుకునేందుకు రైతులు సిద్ధమయ్యారు.

కంభంపాడులో పౌష్టికాహార మాసోత్సవాలు

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలంలోని పాతచెరుకుంపాలెం సెక్టారు పరిధిలోని కకంభంపాడు గ్రామంలో పౌష్టికామార మాసోత్సవాలు కార్యక్రమంలో సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో సిడిపివో అనూరాధ పల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేసే పౌష్టికాహారాన్ని తీసుకోవడం వల్ల తల్లి పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని సూచించారు. క్యాక్రమంలో సూపర్‌వైజరు నాగకుమారి, అంగన్‌వాడీ టీచర్లు జి.రజని, కీర్తిరాజ్యం, రమణతోపాటు ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గ ఎంపిక



చిలకలూరిపేటటౌన్: గాస్పల్ యూనైటేడ్ పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎంపిక చేశారు. నూతన అధ్యక్షుడిగా గుమ్మడి కోటేశ్వరరావు, కార్యదర్శిగా జి రాజారత్నం, కోశాధికారిగా దేవిడ్‌రాజు ఎంపికయ్యారు. మొత్తం 12 మంది సభ్యులు కలిగిన ఈ నూతన కార్యవర్గం మూడు సంవత్సరాల పాటు కొనసాగనుంది. ఈ కార్యక్రమంలో పాస్టర్లు నందమూరి క్రిస్టర్, మేడిద శ్యాముల్‌రాజు, ఎం సంసోను, ఎస్ అబ్రహం, ఎస్ థామస్, ఎంఎస్ మూర్తి, ఎ అబ్రహం, ఎ ఎలీషా పాల్గొన్నారు.

13న ఉపకరణాల స్క్రీనింగ్ క్యాంప్

వినుకొండ(నూజెండ్ల): స్థానిక జాషువా కళా ప్రాంగణంలో కమిట్‌మెంట్స్ సంస్థ మరియు నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ లోకోమోటర్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు స్క్రీన్కింగ్ క్యాంప్ ఈ నెల 13వ తేదీన నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆర్థో లోపం ఉన్నవారు, పూర్తిగా చూపులేనివారు, వినికిడి లోపం ఉన్న వారికి పరికరాల సరఫరాపై పరీక్షలు నిర్వహించిన అవసరమైన వారికి పరికరాలను అందజేయడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 9553749815, 9618210950 నంబర్లను సంప్రదించాలన్నారు.

కనిపించని బంద్ ప్రభావం



బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు



రోడ్డుపై అడ్డుగా వేసిన రాళ్లను తొలగిస్తున్న పోలీసులు



యథావిధిగా వ్యాపారాలు, వాహనాలు

యథావిధిగా కార్యకలాపాలు

గురజాల : తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో ప్రధాన ముద్దాయిగా అరెస్టయిన నేపథ్యంలో టీడీపీ నాయకులు సోమవారం రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చారు. కానీ గురజాల పట్టణంలో బంద్ ప్రభావం ఏ మాత్రం కనిపించలేదు. ఉదయం టీడీపీ నాయకులు ప్రతి దుకాణం వద్దకు వెళ్లి మూసివేయాలని పిలుపునిచ్చారు. కానీ వ్యాపారస్తులు ఏ మాత్రం వారి మాటలను లెక్క చేయకుండా స్వచ్ఛందంగా దుకాణాలు తెరచి వ్యాపారాలు కొనసాగించారు.

చిన్న చిన్న ఘటనలు

టీడీపీ తలపెట్టిన రాష్ట్ర బంద్‌లో చిన్న చిన్న ఘటనలు చోటుచేసుకున్నాయి. రెంటచింతల రహదారిలో రోడ్డుపై ఆర్టీసీ బస్సును నిలుపుదల చేసి అద్దాలు పగులగొట్టేందుకు టీడీపీ నాయకులు ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలంకు చేరుకుని చర్యలు చేపట్టారు. అదే విధంగా పిడుగురాళ్ల రోడ్డులోని సంత వద్ద టీడీపీ నాయకులు వాహనాలు అటువైపుగా వెళ్లకుండా రహదారిపై రాళ్లు ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు వెళ్లి అడ్డుగా ఉంచిన రాళ్లను తొలగించి వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగకుండా చర్యలు చేపట్టారు. రోడ్డుపైకి వచ్చిన టీడీపీ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

పటిష్ట బందోబస్తు

టీడీపీ తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. అడుగడుగునా బందోబస్తు నిర్వహించి ప్రయాణికులు, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా తగు చర్యలు చేపట్టారు. డీఎస్పీ పల్లపురాజు ఆదేశాల మేరకు సీఐ ప్రభాకర్ ఆధ్వర్యంలో ఎస్ఐలు అశోక్‌కుమార్, బి.అనంత కృష్ణలు బందోబస్తు నిర్వహించారు. పోలీసులు చేపట్టిన చర్యలకు పలువురు వ్యాపారులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

రెంటచింతలలో బంద్ ప్రభావం నిల్

రెంటచింతల: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు సోమవారం రాష్ట్రవ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చారు. కానీ బంద్ ప్రభావం మండల కేంద్రమైన రెంటచింతలలో ఎక్కడా కన్పించలేదు. స్థానిక ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, వివిధ వ్యాపార సంస్థలు, బ్యాంక్‌లు యథావిధిగా తెరుచుకోవడంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగలేదు. ఎస్ఐ సామెల్ రాజీవ్ కుమార్, ఏఎస్ఐ హనుమంతురావు పోలీస్ సిబ్బందితో ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. దీంతో వాహనాలు, ఆర్టీసీ బస్సులు నడవడంతో ప్రయాణికులు ఎలాంటి అసౌకర్యానికి గురికాలేదు.

పిడుగురాళ్లలో

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలో బంద్ ప్రభావం కనిపించలేదు. జనజీవనం, వ్యాపారాలు, విద్యార్థులు, ప్రయాణికులకు ఆటంకం లేకుండా యథావిధిగా అన్నీ కొనసాగాయి. పట్టణంలో ఎలాంటి ఆటంకం కలగకుండా ఉదయం నుంచే పట్టణ సీఐ వీవీ ఆంజనేయులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. పాఠశాలలు, బ్యాంకులు, బస్సులు, వ్యాపారాలు అన్నీ సజావుగా సాగటంతో ప్రజా జీవనం రోజు మాదిరిగానే యథావిధిగా కొనసాగింది. చిన్న చిన్న ఘటనలు మినహా పిడుగురాళ్లలో బంద్ ప్రభావం కనిపించ లేదు.

సెల్ టవర్ ఎక్కి హడావుడి..

ఉదయం నుంచి ప్రశాంతంగా ఉన్న పిడుగురాళ్ల పట్టణంలో అలజడి సృష్టించాలని కొంత మంది టీడీపీ కార్యకర్తలు 10 గంటల సమయంలో పోలీస్ స్టేషన్ ఎదురు వీధిలోని సెల్ టవర్ ఎక్కి చంద్రబాబునాయుడిని విడుదల చేయకపోతే ఆత్మహత్య చేసుకుంటామని హడావుడి చేశారు. వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని సెల్ టవర్ ఎక్కిన కరుణాకర్, బాజీలను అదుపులోకి తీసుకొని కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ ఘటన మినహా పిడుగురాళ్ల పట్టణంలో బంద్ ప్రభావం కనిపించ లేదు. అన్నీ యథావిధిగా కొనసాగాయి.

కొనసాగిన వ్యాపారాలు



పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో ప్రజలతో రద్దీగా ఉన్న ప్రాంతం

మాచర్ల: రాష్ట్ర మాజీ సీఎం చంద్రబాబునాయుడు అరెస్టుకు నిరసనగా తెలుగుదేశం పార్టీ ఇచ్చిన పిలుపుతో మాచర్లలో స్పందన కరువైంది. ఏ ఒక్కరూ బంద్ గురించి పట్టించుకోలేదు. తోపుడు బండ్లు, వ్యాపారస్థులు, కిరాణా షాపులు, అన్ని వర్గాల వారు ఉదయం నుంచి రాత్రి దాకా వ్యాపార లావాదేవీలు కొనసాగించారు. ఎక్కడా కూడా బంద్ ప్రభావం కనబడలేదు. టీడీపీ నాయకులు సైతం రోడ్డు ఎక్కలేదు. యథావిధిగా ప్రజలు తమ రోజువారీ విధులను కొనసాగించారు. కేవలం కొన్ని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు మాత్రం ముందు జాగ్రత్తగా సెలవు ప్రకటించాయి. ఎక్కడా బంద్ ప్రభావం కనబడలేదు. బంద్ పిలుపు నేపథ్యంలో అర్బన్ సీఐ బాలకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు అన్ని ప్రాంతాలలో బందోబస్తు నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు.

పేదల అభ్యున్నతే వైఎస్సార్ లక్ష్యం

వైఎస్సార్ విగ్రహ భూమి పూజలో.. వెంకటేశ్వర్లు



భూమి పూజ మహోత్సవంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

పిడుగురాళ్ల: పేదల అభ్యున్నతే దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి లక్ష్యమని పిడుగురాళ్ల మార్కెట్ యార్డు చైర్మన్ కొమెర వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని లెనిన్ నగర్‌లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి భూమి పూజ సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమం బీసీ సెల్ అధ్యక్షులు కందులూరి శివయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలలో ఎంతో మంది రాజకీయంగా ఎదిగేందుకు రాజశేఖర్‌రెడ్డి కృషి చేశారని, ఆయన అడుగు జాడల్లోనే ఆయన తనయుడు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో మంది బీసీలకు ఉన్నత పదవులు కట్టబెట్టారని అన్నారు. అదే విధంగా గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఎంతో మందిని డైరెక్టర్లను, మార్కెట్ యార్డు చైర్మన్‌లను, మున్సిపల్ వైస్ చైర్మన్‌లను చేసి బీసీలకు వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ అండగా ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి, బీసీ సెల్ అధ్యక్షులు కందులూరి శివయ్య, మున్సిపల్ లీగల్ సెల్ సభ్యులు ధారా చెన్నయ్య, నాయకులు కుందుర్తి గురవాచారి, కౌన్సిలర్లు కొక్కెర శ్రీను, కత్తెరపు వాసుదేవరెడ్డి, ఉన్నం ఆంజనేయులు, కుక్కమూడి సుందర్‌రావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇర్లా గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

మిరియాలలో గంగమ్మ తల్లికి కుంకుమ బండి

ప్రారంభించిన పీవీఆర్



కుంకుమ బండి కార్యక్రమంలో వెంకటరామిరెడ్డి

కారెంపూడి: మండలంలోని మిరియాల గ్రామంలో గంగమ్మ తల్లికి గ్రామస్తులు కట్టిన కుంకుమ బండిని వైఎస్సార్‌సీపీ యూత్ వింగ్ జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి సోమవారం రాత్రి ప్రారంభించారు, గంగమ్మ తల్లికి పీవీఆర్ సంప్రదాయ బద్ధంగా పూజలు చేసి కొబ్బరి కాయ కొట్టి అమ్మవారి కుంకుమ బండిని ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల యూత్ అధ్యక్షుడు చిలుకూరి చంద్రశేఖరరెడ్డి, గ్రామ సర్పంచ్ బత్తుల ఏడుకొండలు, ఎంపీటీసీ కొమ్మిరెడ్డి ఎర్రగురవారెడ్డి, ఉప సర్పంచ్ దారెడ్డి ప్రభాకరరెడ్డి, గ్రామ సచివాలయ కన్వీనర్ ఊటా రాజశేఖర్‌రెడ్డి గ్రామ పార్టీ నాయకులు పాల్గొన్నారు. గ్రామానికి విచ్చేసిన పీవీఆర్‌కు గ్రామస్తులు ఘనస్వాగతం పలికి ఘనంగా సన్మానించారు.

వినుకొండలో అమరవీరుల సంస్మరణ దినోత్సవం



నగరవనం కోసం ఎంపిక చేసిన అటవీ ప్రాంతాన్ని సందర్శించిన డీఎఫ్ఓ ఎస్.రామచంద్రరావు

వినుకొండ టౌన్: జాతీయ అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమాన్ని స్థానిక రేంజ్ కాంప్లెక్స్ నందు సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పల్నాడు జిల్లా అటవీశాఖ అధికారి ఎస్. రామచంద్రరావు హాజరై, అమర వీరుల చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అటవీ రక్షణలో భాగంగా వారు చేసిన త్యాగాలను గుర్తుచేస్తూ, అటవీ రక్షణలో తీసుకోవలసిన జాగ్రత్తలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. వినుకొండ రేంజ్ పరిధిలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో నగర వనం కొరకు ఎంపిక చేసిన బొల్లాపల్లి మండలం సరికొండపాలెం అటవీ ప్రాంతాన్ని ఆయన సందర్శించారు. ఆయన వెంట క్షేత్రాధికారి సయ్యద్ హుస్సేన్, రేంజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు రీ–వెరిఫికేషన్ పకడ్బందీగా నిర్వహించాలి

అసిస్టెంట్ ఎలక్టోరల్ అధికారి, మున్సిపల్ కమిషనర్ రామ్మోహనరావు



బీఎల్‌వోలతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

నరసరావుపేట: పురపాలక సంఘ పరిధిలో ఓటరు రీ–వెరిఫికేషన్ పకడ్బందీగా నిర్వహించాల్సిన బాధ్యత బీఎల్‌వోలపైనే ఉందని అసిస్టెంట్ ఎన్నికల అధికారి, మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావు పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ అతిథి గృహంలో బీఎల్‌వోలకు ఓటర్ల రీ వెరిఫికేషన్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. జీరో డోర్ నంబర్లు, ఒకే డోర్‌పై పదికంటే అధికంగా ఓట్లు, డబుల్ ఎంట్రీలను కనుగొని నమోదు చేసి నివేదిక అందజేయాలన్నారు.

క్రీస్తు బోధనలను ప్రతి ఒక్కరికీ చేరవేయండి



చైతన్యను సత్కరిస్తున్న పాస్టర్స్ అసోసియేషన్ సంఘ నాయకులు

మాచర్ల: ప్రతి పాస్టర్ క్రైస్తవ బోధనలను ప్రతి ఒక్కరికీ చేర్చి సమాజ సేవలో భాగస్వాములు కావాలని జిల్లా పాస్టర్ చైతన్య గెరా అన్నారు. సోమవారం పల్నాడు దైవ సేవకుల సహవాసం ఆధ్వర్యంలో పట్టణంలోని సుద్దగుంతల చర్చిలో ప్రసాద్ పాస్టర్, ఎ.జి.ఇమ్మాయిల్ ఆధ్వర్యంలో సేవకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ సేవకులు లోకంలో అనవసరమైన విషయాలపై ఆలోచనలు మాని సేవపై దృష్టి పెట్టాలన్నారు. బైబిలులో ఉన్న పలు వ్యాఖ్యలు గురించి తెలిపారు. అనంతరం పల్నాడు దైవ సేవకులు కార్యవర్గానికి చెందిన వారు చైతన్యను వెస్లి, మోహన్, బ్రహ్మనాయుడు, ఎలియాజర్, యెహోషా తదితరులు సత్కరించారు.

అడవుల సంరక్షణే లక్ష్యం కావాలి

- కలెక్టర్ లోతేటి శివశంకర్
- పర్యావరణ వేత్త జాజి రాసిన పుస్తకం ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ తదితరులు

నరసరావుపేట: దేశంలో ఉన్న 33 శాతం అడవులు వృద్ధి చేసుకోవడం కోసం కారంపూడి గ్రామానికి చెందిన పర్యావరణ వేత్త కొమెర అంకారావు (జాజి) తలపెట్టిన కార్యక్రమానికి ప్రతి ఒక్కరు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ పిలుపు ఇచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లో జాజి రాసిన ప్రకృతి ఆహారం అనే పుస్తకం, కరపత్రం ఆవిష్కరించి కలెక్టర్ మాట్లాడారు. జాజి తలపెట్టి విజయవంతం చేసిన కోటి విత్తన బంతులు కార్యక్రమం, పక్షుల కోసం వేస్తున్న పంట, ప్రకృతి ఔషధ మొక్కలు గురించి ఉన్న అపార అనుభవం తనను ఆశ్చర్యపరిచిందన్నారు. మొక్కలు చెట్లపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమన్నారు. జాజి మాట్లాడుతూ జిల్లాలో అడవులు, నదులు కలుషితం కాకుండా ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా సహకరించాలన్నారు. అడవి చుట్టూ, పక్కన ఉన్న పొలాలలో ప్రకృతి వ్యవసాయంపై ప్రచారం చేసి, అడవి ప్రాణుల ఉనికిని కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. ప్లాస్టిక్ స్వచ్ఛందంగా వాడటం ఆపివేయాలని, చెట్లు నరకకుండా కాపాడుకోవాలని, ప్రకృతి, అడవి ప్రాణులు సంరక్షణ అందరి కర్తవ్యం కావాలన్నారు. సరికొత్త హరిత భారత్ కోసం ప్రతిఒక్కరూ కూడా ఈ ఉద్యమంలో పాలుపంచుకొని అడవులు, పచ్చని ప్రకృతి వృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాదు, ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, డీఆర్వో కె.వినాయకం, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష విజయవంతం చేయండి

శావల్యాపురం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై గ్రామ సచివాలయాల వారీగా వైద్య ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు, సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వే చేసి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారిని గుర్తించాలన్నారు. సచివాలయాల వారీగా ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి గ్రామాల్లోని పేదలకు మెరుగైన వైద్యసేవలు పారదర్శకంగా అందించటానికి జగనన్న ఆరోగ్య సురక్ష కార్య క్రమం ఎంతో దోహదపడతుందన్నారు. ఈ సమావేశంలో మండల ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి వేముల వెంకట భాస్కర్, ఈవోపీఆర్డీ సుగుణ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పారిశుధ్య చర్యలు నిర్వహించాలి

బొల్లాపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ షేక్ జిలానీబాషా అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శుల సమీక్ష సోమవారం నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో వర్మీకం పోస్టు ఎరువు తయారు చేయాలని, గ్రామాల్లో సేకరించిన చెత్తను షెడ్స్‌కు తరలించాలని సూచించారు. స్పందనలో అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించి వివరాలు మండల పరిషత్‌కు అందజేయాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా ఈనెల 30 నుంచి అక్టోబర్ 12 వరకు షెడ్యూల్ ప్రకారం గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. తహశీల్దార్, ఎంపీడీఓలు రెండు బృందాల ఆధ్వర్యంలో వెల్లటూరు, బొల్లాపల్లి పీహెచ్‌సీల వైద్యాధికారులు, ప్రత్యేక వైద్య నిపుణులు బృందంలో ఉంటారని తెలిపారు. ఈనెల 15 నుంచి ప్రతి గ్రామంలో ఇంటింటా ఆరోగ్య వివరాలు డేటా సేకరించి నమోదు చేయడం జరుగుతుందని, అనంతరం ఆరోగ్య సురక్షలో ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి ఎంపిడిఓ తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చాలీసా పారాయణం

వినుకొండ(నూజెండ్ల): విశ్వహిందూపరిషత్ ఆవిర్భావ వారోత్సవాల్లో భాగంగా స్థానిక గుంటి ఆంజనేయస్వామి వారి ఆలయంలో లోక కల్యాణార్థం సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. పరిషత్‌ను 1964లో శ్రీకృష్ణాష్టమి రోజున స్థాపించారని, ముందుగా శ్రీకృష్ణ విగ్రహానికి, శ్రీ గుంటి ఆంజనేయస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సత్సంగాల వారు, భక్తులు పాల్గొని 108 మంది 21మార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో విశ్వ హిందూపరిషత్ పల్నాడు జిల్లా అధ్యక్షులు భాగవతుల రవికుమార్, ఆలయ అర్చకులు ఆనందాచార్యులు, ఆలయ చైర్మన్ భవన్నారాయణ, పరిషత్ సమరసత అధ్యక్షులు గజవల్లి నాగపవన్, కొలిశెట్టి సుబ్బారావు, భద్రయ్య, గోనుగుంట్ల గంటారావు, నాగాచారి, భవనాసి సాంబశివరావు, కోట మల్లికార్జున, మహిళలు, భక్తులు, విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.60,925 హుండీ ఆదాయం

నాదెండ్ల: గణపవరం–నాదెండ్ల డొంక రోడ్డులో కొలువైయున్న నందికుంట విఘ్నేశ్వర స్వామి ఆలయంలో సోమవారం దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారుల సమక్షంలో హుండీ లెక్కింపు నిర్వహించారు. ఈ ఏడాది ఆగస్టు 4 నుండి సోమవారం వరకూ 37 రోజుల కాల వ్యవధిలో మొత్తం రూ.60,925లు హుండీ ఆదాయం సమకూరింది. ఈ నగదును దేవదాయ శాఖ ఖాతాలో జమ చేయనున్నట్లు ఈవో తులసీదాస్ తెలిపారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ మంజూష, స్థానిక పెద్దలు కోనేటి నాగయ్య, కె.రామకృష్ణ, సుబ్బారావు, ఎం.శివయ్య ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

నాదెండ్ల: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ యువకుడు పురుగు మందు తాగి గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై బలరామిరెడ్డి తెలిపిన వివరాల మేరకు నాదెండ్ల చిన్న ఎస్సీ కాలనీకి చెందిన జంగా సుందరరావు (30) వ్యవసాయ కూలీ పనులు చేసుకుని జీవిస్తుంటాడు. కొద్దిరోజులుగా భార్యభర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. దీంతో ఈ నెల 7న పొలం వెళ్లి గడ్డి మందు తాగాడు. స్థానికులు గమనించి బాధితుడిని 108 సాయంతో గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. భార్య హారిక ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.


కడుపునొప్పి తాళలేక ఆత్మహత్య



మృతిచెందిన అపరజిత్

యడ్లపాడు: జన్మభూమిలో ఉపాధి పనులు లేక ఒరిస్సా నుంచి వలస వచ్చిన ఓ కుటుంబానికి చెందిన బాలిక కడుపునొప్పి తాళలేక ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం... ఒరిస్సా రాష్ట్రం గంజాం జిల్లా జామురి తాలూకాకు చెందిన పితంబర్ దాస్, మామిదాస్ దంపతులు తమ నలుగురు సంతానంతో కొద్దికాలం కిందట ఉపాధి పనుల నిమిత్తం మండలానికి వలస వచ్చారు. పారిశ్రామిక వాడ బోయపాలెంలోని విశ్వతేజ నూలుమిల్లులో కార్మికులుగా చేరారు. భార్యభర్తలు తమ ముగ్గురు కుమారులు, కుమార్తెతో క్వార్టర్స్‌లోనే ఉంటూ జీవనం సాగిస్తున్నారు. కొద్దిరోజులుగా కుమార్తె అపరజిత్ దాస్ కడుపునొప్పితో బాధ పడుతుండగా కుటుంబ సభ్యులు గ్రామంలోని మెడికల్ షాపుల్లో మాత్రల్ని తెచ్చి ఇస్తున్నారు. నొప్పి తగ్గిన మరుసటి రోజు తమతో పాటు పనులకు తీసుకు వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 9వ తేదీన కుమార్తె కడుపునొప్పి అనడంతో కూడా చిన్నకొడుకు సచిన్ దాసును తోడుండి మిగిలిన వారంతా పనులకు వెళ్లారు. మధ్యాహ్నం తల్లి మామిదాస్ భోజనానికి వచ్చి తలుపు కొట్టగా ఇంట్లో ఉన్న కొడుకు పెద్దగా కేకలు వినిపించి, డోర్‌ను పగులగొట్టి లోపలికి వెళ్లి చూశారు. హాల్లో కుమార్తె అపరజిత్ (15) తన చున్నీతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించింది. తోటి కార్మికుల సాయంతో కుమార్తెను కిందకు దించి కంపెనీ వాహనంలో గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే చనిపోయినట్లు నిర్ధారించారు. దీంతో తీవ్రమైన కడుపునొప్పి తాళలేక తన బిడ్డ ఆత్మహత్య చేసుకుందని ఇచ్చిన తల్లి ఫిర్యాదు మేరకు యడ్లపాడు ఎస్ఐ ప్రత్తిపాటి సురేష్ కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి సోమవారం అప్పగించారు.

ఆరంభానికి సిద్ధమైన విశ్రాంతి భవనం



శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామానికి వెళ్లే రహదారి మార్గంలో నూతనంగా రూ. 5 లక్షల వ్యయంతో ప్రయాణికులు విశ్రాంతి భవనం నిర్మాణ పనులు పూర్తి అయినట్లు పంచాయతీరాజ్ ఏఈ వెంకటేశ్వరస్వామి తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏఈ మాట్లాడుతూ నూతన ప్రయాణికుల కూర్చొనే విధంగా భవన నిర్మాణ పనులతో పాటు మంచి నీటి సమస్య తలెత్తకుండా చేతి పంపు కూడా ఏర్పాటు చేశామన్నారు. త్వరలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, ఎంపీపీ, మండల, గ్రామ ప్రజాప్రతినిధులు సారథ్యంలో ప్రారంభోత్సవం చేయనున్నట్లు ఏఈ చెప్పారు.

మిరప పొలాలను పరిశీలించిన అధికారి

రొంపిచర్ల: మండలంలో రైతులు సాగుచేస్తున్న మిరప పొలాలను ఉద్యానవన శాఖ అధికారి నవీన్ కుమార్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా రైతులు మిరప మొక్కలను సాగు చేసే ముందుగా చివరి దుక్కిలో రైతులు అవలంబించాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. ఎకరాకు 2 నుండి 3 బస్తాల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్‌ను ఆఖరి దుక్కిలో వేసి కలియదున్నాలన్నారు. ఇలా చేయటం వల్ల భాస్వరం మొక్కల వేర్లకు అంది వేరు వ్యవస్థ బాగా అభివృద్ధి చెందుతుందన్నారు. మొక్కల పైభాగంలో కూడా ఆకులు వచ్చి ఎదుగుదల బాగా ఉంటుందన్నారు. అలాగే ఎకరాకు 2 బస్తాల వేప పిండిని చివరి దుక్కిలో వేసి కలియదున్నటం వల్ల వేరు కుళ్లుడు, వేరు పురుగు బారి నుండి పంటను కాపాడుకోవచ్చు అన్నారు. మిర్చి పంట ఇప్పటికే 150 ఎకరాల్లో సాగు చేశారని, మరింత విస్తీర్ణంలో సాగు చేసేందుకు రైతులు అసక్తి చూపుతున్నారన్నారు. ఈ సందర్భంగా మిర్చి రైతులకు పంటలో యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలపై సూచనలు చేశారు.